www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023

5

అన్నమయ్య



అర్జీలు పరిష్కరించడంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

కలెక్టర్ గిరిష ఆదేశాల మేరకు మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని స్పందన సమావేశహాలులో జగనన్నకు చెబుదాం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలను చూస్తున్న జిల్లా స్థాయి అధికారులు వారి కార్యాలయ సిబ్బంది, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పీఎంయు, జిల్లా ఆడిట్ టీం అధికారులందరికీ జిల్లా ఇన్‌ఛార్జి అధికారులు శ్రీనివాస్, సంపత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం యొక్క తేడాలను వాటి ప్రాధాన్యతలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అర్జీలకు సంబంధించి సంతృప్తికర స్థాయిని పెంచడం, రీఓపెన్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం పైన దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలపై అధికారులందరికీ శిక్షకులు వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మనోహర్ రాజు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగించిన సిఎం జగన్

పాదయాత్రలో నారా లోకేష్
కడపలో జన నీరాజనం
లోకేష్ దృష్టికి సమస్యల వెల్లువ



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక యువతను దారుణంగా మోసం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 118 రోజుకు చేరుకుంది. మంగళవారం కడప శివారులోని బిల్టప్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై కడప నగరంలోని రామకృష్ణ కాలేజి, మాసీమ సర్కిల్, రెండవ గాంధీబొమ్మ, చెన్నూరు బస్టాండ్, మొదటి గాంధీబొమ్మ, గోకుల్ సర్కిల్, కృష్ణదేవరాయ సర్కిల్, శంకరాపురం, అప్సర సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, చిన్నచౌక్, రాజరాజేశ్వరి కల్యాణ మండపం ఎదుట విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో రెడ్డి సామాజికవర్గీయులు, బ్రహ్మణ, ముస్లిములు, వైశ్యులు, నిరుద్యోగులు, దినసరి కూలీలు, స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ అబద్దాలు, మోసం, వంచనకు ప్రతిరూపం జగన్ అని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఏటా జాబ్ కేలండర్, 2.3 లక్షల ఉద్యోగాలిస్తానని చెప్పి మోసగించారని తెలిపారు. జగన్ నిర్వాకం కారణంగా తీవ్ర నిరాశ,నిస్పృహలకు గురైన 470 మంది యువతీ యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలుగా మార్చి, వారి రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక ఒక్క జాబ్ కేలండర్ గానీ, ఉద్యోగం కానీ లేదని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో కేవలం నలుగురు రెడ్లు మాత్రమే బాగుపడ్డారన్నారు. సజ్జల, సాయిరెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డికి తప్ప ఏ ఇతర కుటుంబానికి న్యాయం జరగలేదని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. దానిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, కర్జూరం తదితర పంటలు వేసేలా అధిక ప్రోత్సాహం ఇస్తామని తెలిపారు. రాయలసీమ రైతులకు సరైన ప్రోత్సాహం ఇస్తే బంగారం పండిస్తారని చెప్పారు. పరిపాలన ఒకే చోట అభివద్ధి వికేంద్రీకరణ టిడిపి నినాదమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఫ్యాక్షన్‌లో ఇబ్బంది పడిన కుటుంబాలను ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. రెడ్డి కార్పొరేషన్ పెట్టడమే తప్ప జగన్ ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. రైతులకు కులం ఉండదని, ఇప్పుడు రైతుల్లో కూడా జగన్ ప్రభుత్వం కులం చూస్తోందన్నారు. మోటార్ల మీటర్లు పెట్టి రైతులను వైసిపి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌరసేవలందించేందుకు ఉద్దేశించిన మీ సేవ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. మీ-సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని తీసుకుంటూ అక్కడ పనిచేసే సిబ్బందిని మాత్రం రోడ్డున పడేశారని తెలిపారు. వారికి 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 171 గవర్నమెంట్ అర్బన్ మీసేవ కేంద్రాలను ఎటువంటి నోటీసు లేకుండానే స్వాధీనం చేసుకొని తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కులానికొక కుర్చీలేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్నివర్గాలను దారుణంగా మోసగించారని తెలిపారు. మైనారిటీల మానప్రాణాలతో పాటు ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా వేలకోట్ల రూపాయల మైనార్టీల ఆస్తులను వైసిపి నేతలు కబ్జా చేశారని విమర్శించారు. యువతకు తీరని ద్రోహం చేశారని తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు శిలాఫలకాలు వేసిన జగన్ ఆ పనులను అడుగు కూడా ముందుకు కదల్చలేదన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ఇళ్ల నిర్మాణ పనుల్లో నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ గిరీష అన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం, తొగురుపేటలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులకు కేటాయించిన ఇండ్ల స్థలాల లేఅవుట్‌ను కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎంతమందికి ఎన్ని ఎకరాలలో ఎన్ని ప్లాట్లు కేటాయిచారని తహాశీల్దార్‌ను ప్రశ్నించగా 10 ఎకరాల్లో దాదాపు 120 మందికి ప్లాట్లు కేటాయించమని, ఇందులో రామచంద్రాపురం వారికి 40 తొగురుపేట వాళ్లకు 80 ప్లాట్లు ఇచ్చినట్లు తహాశీల్దార్ తెలిపారు. ఆ స్థలంలో ఇండ్లను నిర్మించుకోవడంలో గల సమస్యలను, ఇబ్బందులపై గ్రామస్తులతో కలెక్టర్ ఆరా తీశారు. గ్రామస్తులు స్పందిస్తూ. ఇండ్ల కొరకు తమ కేటాయించిన స్థలం కొండ పైభాగంలో కొంత, క్రింది ప్రాంతంలో ఎటువాలుగా ఉందని దానిని లెవలింగ్ చేయాల్సి ఉందని, రహదారులు, నీటి వసతి ఏర్పాటు చేయాలని, అప్పటివరకు ఇండ్లు నిర్మాణం చేపట్టలేమని గ్రామస్తులు కలెక్టరుకు వివరించారు. ఇండ్ల స్థలాన్ని లెవెలింగ్ చేసి అభివృద్ధి చేయడానికి గల అవకాశాలపై పంచాయితీ రాజ్ అధికారులతో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. కొండ పైభాగంలో కేటాయించిన స్థలం లెవెలింగ్ బాగానే ఉందని, దానిని మరికొంత అభివృద్ధి చేసి దారి ఏర్పాటు చేయాలని చెప్పారు. అక్కడే లే ఔట్‌ను అనుకోని ఉన్న స్థలం ఎవరిది, ఎంత ఉందని కలెక్టర్ అడుగగా.. అది పట్టభూమి 2.50 ఎకరాలు తొగురుపేటకు చెందిన సుధాకర్ కుటుంబానికి చెందినదని అధికారులు గ్రామస్తులు కలెక్టర్కు వివరించారు. సదరు వ్యక్తి అంగీకరిస్తే ఆ భూమిని ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని, లేదా స్థలమే కావాలంటే మరొక ప్రదేశంలో అతనికి స్థలం కేటాయించడం జరుగుతుందని.. కొండ కింద ఏటువాలు ప్రాంతంలో ఇండ్లను కేటాయించిన వారందరికీ అక్కడ ప్లాట్లు కేటాయించుటకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు సదరు వ్యక్తితో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. రామచంద్రాపురంలో కొందరు తమకు వేరే ప్రాంతంలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్కు విన్నవించారు. తొగురుపేట రామచంద్రపురం లకు త్రాగునీటి సౌకర్యం కావాలని ఇందుకు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని, స్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, నేటి వసతి కల్పించి స్మశానాన్ని అభివ ృద్ధి చేయాలని, ఆయా గ్రామంలో ఉన్న రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేయాలని రైతులు, గ్రామస్థులు కోరారు. వివిధ అంశాలలో గ్రామస్తులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ సావధానంగా ఆలకించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తొగురుపేట, రామచంద్రపురం ప్రజలను కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఓ భాస్కర్‌రెడ్డి, తహాశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, హౌసింగ్ పీడీ శివయ్య, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు కెజెఎస్ చంద్రారెడ్డి, ప్రసన్న కుమార్, వివిధ శాఖల అధికారులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

'విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి'



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనంలో పాల్గొన్న అన్నమయ్య జిల్లా నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యం ఫీజుల దోపిడీని అరికట్టాలని, జీవో నంబర్ 1, 42లను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కార్తీక్, నరసింహ డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర ప్లీనరీ సమావేశాలలో తీసుకున్న నిర్ణయలపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు డిసెంబర్ నుంచే పిఆర్ఓలను పెట్టి అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యను అంగట్లో సరుకులాగా కిలోల ప్రకారం అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవడంతో పూర్తిగా విఫలం చెందారని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ తదితర స్టడీ మెటీరియల్ అంతా ఆయా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని బయట కొనుగోలు చేసిన పుస్తకాలు తమ పాఠశాలలో ఉపయోగపడని 5 వేల నుంచి 8 వేలకు పైగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్, ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు 25 శాతం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్ర వ్యవస్థను వీడి ప్రభుత్వ నిబంధనలను అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, అఖిల్, నిరంజన్, శశి కుమార్ పాల్గొన్నారు.

టిడిపి గెలుపు కోసం కృషి చేయాలి

బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివ ప్రసాద్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి

బిసిలంతా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పాల ఏకరి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గురిగింజ కుంట శివప్రసాద నాయుడు తెలిపారు. మంగళవారం గుంటూరులోని మంగళగిరి టిడిపి కార్యాలయంలో బిసి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి అధ్యక్షత బిసి సెల్ సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, బిసి ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, బిసి ఫెడరేషన్ రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గంజాం రాఘవేంద్ర హాజరైనట్లు తెలిపారు. సమావేశంలో బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంపై చర్చించినట్లు పేర్కొన్నారు. పార్లమెంటు పరిధిలోని ఆయా పార్లమెంట్ అధ్యక్షులు సాధికార సమితి కమిటీ సభ్యులందరూ కలిసి సభలు సమావేశాలు నిర్వహించి జగన్ చేసే అవినీతి అరాచకాలను ఎండగట్టాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని బడుగు బలహీన వర్గాలపై దాడులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. కక్ష సాధింపు ధోరణితో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై తప్పుడు కేసులు బలాయిస్తున్నారని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు. అనంతరం తిరుమల వెంకన్న స్వామి ప్రసాదాలను కొల్లు రవీంద్ర, పట్టాభి రామ్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలయకరి కో- ఆర్డినేటర్ జీవన్ కుమార్ నాయుడు, పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర సాధికార కమిటీ కన్వీనర్లు, బిసి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు , సాధికార సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిసి సాధికార సమితి నాయకులు

ఆలయాలకు మహర్దశ : కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి

జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ కల్గిందని కలెక్టర్ గిరీష, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కార్మిక, కర్మాగారాల, బాయిలర్ల, ఇన్సురెన్స్ వైద్య సేవల ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్ లాల్ నాయక్, కలెక్టర్ గిరీష, ఎస్‌పి గంగాధర్ రావ్ పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె పెద్దబిడికిలో రూ 26 లక్షలతో పెద్దబిడికిలోని మారెమ్మ ఆలయంలో పూర్తయిన ప్రాకారం, ఫ్లోరింగ్ నిర్మాణాల ప్రారంబోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సిఎం జగన్ అపర శ్రీకృష్ణ దేవరాయలుగా పేరొందారన్నారు. పెద్దబిడికి సమస్యలను ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్దబిడికి, అడవికమ్మపల్లెలలో సెల్ టవర్లు లేక ఈ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన సెల్ టవర్లు ఏర్పాటు చేయించాలని కోరారు. పెద్దబిడికిలో పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలని కోరారు. కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్ లాల్ స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎమ్మెల్యే, కలెక్టర్,ఎస్‌పి పాల్గొన్నారు.

ప్రజలందరికీ శుద్ధిజలం అందించడమే ధ్యేయం

ప్రజలందరికీ శుద్ధి జలం అందించడమే తమ ధ్యేయమని కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కార్మిక, కర్మాగారముల, బాయిలర్ల, ఇన్సూరెన్స్ వైద్యసేవల ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్ లాల్ నాయక్ పేర్కొన్నారు. సంబేపల్లె మండలం పెద్దబిడికిలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కావడంపై ఆ ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమయ్యింది. కార్యక్రమాలలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రా రెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి, పంచాయితీ రాజ్ ఈ ఎన్ సి బాలూ నాయక్, సర్పంచ్ వెంకట రమణ నాయక్, ఆవుల మల్లికార్జున రెడ్డి, ఎంపిటిసిలు సీతమ్మ, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవపట్ల వెంకట్రామిరెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, శ్రీనూ నాయక్,మహేంద్ర నాయక్,తిరుపాల్ నాయక్, రామూర్తి నాయక్, కిషోర్ రెడ్డి, మహేశ్వర,మాధవ నాయుడు, దేవాదాయ శాఖ జిల్లా అధికారులు విశ్వనాథ్, శంకర్ బాలాజీ, డిఇ గంగయ్య, ఇఇ లు కొండారెడ్డి, రమణా రెడ్డి, తహాశీల్దార్ మహేశ్వరి భాయి, ఎంపిడిఓ నరసింహులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే



డయేరియా నివారణపై గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న వైద్యులు

డయేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

పీలేరు: సంపూర్ణ ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకున్నప్పుడే వ్యాధులు లేని సమాజం సాధ్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆశ డే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ సీజన్ల వారీ ఆరోగ్య సమస్యల సమిష్టి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ 5 నుండి 17 వరకు జరిగే ఉధృత అతిసార నియంత్రణా కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లలున్న ప్రతి ఇంటినీ సందర్శించి డబ్ల్యూ.హెచ్.ఓ సిపార్సు చేసిన ఓ.ఆర్.యస్ ద్రావణం తయారీ విధానం, జింక్ మాత్ర డయేరియా నియంత్రణకు పనిచేయు విధానం, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన నివారణా చర్యలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి, ఆరోగ్య సమస్యల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తర్వాత వారు సిబ్బందితో కలిసి డయేరియా నివారణపై గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పీహెచ్‌ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎంలు, సిహెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సిడిపిఒ ఆకస్మిక తనిఖీ

రాజంపేట అర్బన్ : గ్రామీణ పరిధిలోని మన్నూరు, జాంద్రపేట అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ సిడిపిఒ సరళా దేవి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించే గుడ్లు, పాలు, పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. టీచర్లు, ఆయాలు కేంద్రానికి సరైన సమయానికి రావాలని తెలిపారు. పిల్లలకు అందించే మధ్యాహ్నం భోజనం నాణ్యతతో ఉండాలని పేర్కొన్నారు. టీచర్లు, ఆయాలు సరైన సమయానికి కేంద్రానికి రాకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అసిస్టెంట్ హనుమంతు రమేష్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సిడిపిఒ సరళా దేవి

గురుప్రసాద్‌కు మదర్‌థెరిసా అవార్డు

- గవర్నర్ జస్టిస్ నజీర్ అహ్మద్ చేతుల మీదుగా ప్రదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జ్ఞానాంబికా విద్యా సంస్థల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ మదర్‌థెరిసా మెమోరియల్ నేషనల్ అవార్డు అందుకున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ జస్టిస్ నజీర్ అహ్మద్ చేతుల మీదుగా గురు ప్రసాద్ ఈ అవార్డు అందుకున్నారు. విద్యా, సామాజిక సేవా కార్యక్రమాల్లో గురు ప్రసాద్ చూపిన చొరవ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో గురు ప్రసాద్ చేసిన కృషికి ఈ అవార్డు అందింది.



అవార్డును అందుకుంటున్న గురుప్రసాద్

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

యువత చదువుతోపాటు క్రీడల పైనా దృష్టి సారించి బాగా రాణిం చాలని కలెక్టర్ గిరీష, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు కలెక్టర్ శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త వివిధ క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం మెరుగవడంతో పాటు భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతోగానో దోహదపడుతోందని, ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదానాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు. క్రీడలను ప్రోత్సహించే నిమిత్తం ప్రభుత్వ సూచనలు, శాప్ ఆదేశాల మేరకు జిల్లాలో మే 1 నుంచి జూన్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా 50 వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం నుంచి రూ 3.50 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వేసవి క్రీడా శిబిరాలు ముగింపు సందర్భంగా వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, యోగాకు సంబంధించిన క్రీడా పరికరాలను యువతకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడా పరికరాలను బాగా వినియోగించుకొని ఆయా క్రీడలలో రాణించాలని సూచించారు. యువతకు చదువు క్రమశిక్షణ ఎంత ముఖ్యమో క్రీడలూ అంతేనన్నారు. హాకీ, బాస్కెట్బాల్, క్రికెట్ లాంటి క్రీడలలో బాగా శిక్షణ పొంది జిల్లా నుంచి వెళ్లిన వారిలో చాలామంది క్రీడలలో రాణిస్తున్నారని చెప్పారు. తెల్లవారు జామునే లేచి ఫిజికల్ ఎక్సర్సైజులు, యోగా చేయాలని సూచించారు. ప్రస్తుతం క్రీడా పరికరాలు పొందిన పిల్లలందరూ వాటిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. త్వరలో ఖేలో ఆంధ్ర ప్రోగ్రాం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాదికి వేసవి సెలవుల క్యాంపుల్లో పాల్గొనే క్రీడా సంఘాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కెజిబివి, మోడల్ స్కూల్స్ సంక్షేమ హాస్టల్లోని పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయగలిగేలా తగు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని స్టెప్ సిఇఒకు సూచించారు. రాయచోటిలో నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియానికి అవసరమైన మెటీరియల్ తెప్పించుకునేలా ప్రతిపాదనలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, క్రికెట్ పరికరాలను, ఖోఖో, కబడ్డీ మోకాలి క్యాప్స్, యోగా మాట్స్ , సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ గ్రేస్ నిర్మల, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ షఫీ, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా కారులను అభినందిస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. మదనపల్లి రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ రాజేష్ కుమార్, రాధిక దంపతుల కుమార్తె హేమ శ్రీ హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు. ఆమెకు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ ప్రశంస పత్రంతో పాటు పూలమొక్క బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 29 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. హేమశ్రీ మాట్లాడుతూ కేన్సర్ బాధితులు కీమోథెరపి సమయంలో జుట్టు రాలి, మనోవేదనకు గురవుతారని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని కేశాలు దానం చేసినట్లు తెలిపారు. మదనపల్లి రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో చిన్న ప్రాయం నుండే సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలుస్తున్న హెల్పింగ్ మైండ్స్ సేవలను అభినందించారు.



కేశాలు దానం చేసిన హేమశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జులేఖబేగం

అతిసార నియంత్రణపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


అతిసార నియంత్రణపై మండల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆశా డే సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి అతిసార నియంత్రణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ నెల 5 నుంచి 17వ వరకు నిర్వహించు అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అతిసారపై అవగాహన కల్పించాలన్నారు. ఎఎన్ఎంలు వారి పరిధి లోని ఐదేళ్ల లోపు వయసు కలిగిన పిల్లల ఇంటిలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తప్పనిసరిగా ఉంచాలన్నారు. బాలింతలకు, చిన్నపిల్లలకు వాంతులు, విరోచనాలు, నీరసం వంటి లక్షణాలు కలిగి ఉంటే వారిని ప్రత్యేకంగా గుర్తిం చాలన్నారు. ఒఆర్ఎస్ ద్రావణంతోపాటు జింక్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. డయేరియా వ్యాధి కలిగిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజుల పాటు జింక్ అందించాలన్నారు. టిబి సూపర్వైజర్ నాగిరెడ్డి మాట్లాడుతూ టిబి లక్షణాలు కలిగిన వ్యక్తులు వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం పొందా లని కోరారు. కాచి వడగట్టిన నీటిని తాగాలని, పౌష్టికాహారం తీసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది మల్లిక, రామ చంద్ర, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరు వేశారు.. మోటర్ మరిచారు..!

ప్రజాశక్తి-సుండుపల్లి

గ్రామ పంచాయతీలోని చీకటిపల్లె సమీపంలో జగనన్న కాలనీలకు కోసం బోరు వేశారు కానీ మోటర్ బిగించడం మరిచారని వెంటనే మోటర్ ఏర్పాటు చేయాలని గృహ లబ్దిదారులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం జగనన్న కాలనీలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి స్థలాన్ని కేటా యించిందన్నారు. ఇసుక, ఇటుక, మట్టి ధరలు ఎక్కువుగా ఉన్నా ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టా మన్నారు. బిల్లులు పడవని ఇబ్బందులు పెడతారని భయంతో నిర్మాణాలను వేగవంతం చేశామన్నారు. కాలనీలో నీరు కోసం బోర్లు వేశారు కానీ మోటార్ అమర్చలేదని తెలిపారు. రోజుకు వెయ్యి రూపాయలు ఖర్చు చేసి ట్యాంకుల ద్వారా నీటిని కొనుగోలు చేసుకొని ఇంటి పనులను చేసుకుంటున్నామని పేర్కొ న్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బోరుకు మోటర్లను అమర్చి నీటిని అందిస్తే గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తవుతాయని చెప్పారు.


జగనన్న కాలనీలో మోటర్‌లేని బోరు


శివపార్వతుల కల్యాణోత్సవాన్నినిర్వహిస్తున్న అర్చకులు

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేటలో వెలసి ఉన్న శ్రీపర్వత వర్ధినిదేవి సమేతస్వామి దేవస్థానంలో 134వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ పురోహితులు చాపాటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా కల్యాణానికి ఉభయదారులు కాసుల నరసింహులు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎంపిపి ముద్దాబాబుల్ రెడ్డి కుటుంబ సభ్యులు కళ్యాణానికి హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందించారు. అనం తరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యా యులు మలవతు సుబ్బరాయుడు, సామలసుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, సోముబాలాజీ, నాగభూషణం, బాబు, మాడ చంగల్ రాయలు, మాడ కుమా రస్వామి, బండారు సురేష్, మామిళ్ళ సురేష్ , గుంటి శివయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని చుక్కాయిపల్లెకు చెందిన ఎలక్ట్రీషియన్ శంకరయ్య ఇటీవల మృతి చెందడంతో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శంకర య్య కుటుంబానికి రూ.21 వేలు ఆర్థికసాయం అందిం చారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు తరుణ్‌కుమార్, అధ్యక్షులు కెవిఎస్.వర్మ, ఉపాధ్యక్షులు మాంకాలయ్య, కార్య దర్శి సంజీవ నాయుడు, సహకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఎలక్ట్రికల్ కార్మికుడు యూనియన్‌లో సభ్యత్వం పొందాలని అన్నారు. ఎలక్ట్రికల్ కార్మికులు ఐకమత్యంగా ఉంటూ ఒకరికొకరు సహాయ సహకారాలు అంది పుచ్చుకోవాలని సూచించారు. కార్మికులకు ఎవరికి ఏ సమస్య వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు.


ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

గర్భిణులు ఐరన్ మాత్రలు తప్పక వాడాలి

కలకడ: గర్భిణులకు ఐరన్ మాత్రలు తప్పక వాడాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండ లంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కె.దొడ్డిపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కష్టతరమైన గర్భిణులను గుర్తించి ఉన్నత స్థాయి వైద్యశాలలకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. హిమోగ్లోబిన్ తక్కువుగా ఉన్న గర్భిణులను గుర్తించి ఐరన్ సుక్రోజ్‌లు, ఐరన్ టాబ్లెట్స్ డబల్ డోసు ఇవ్వాలని తెలిపారు. 50సంవత్సరాలు పైబడిన వారందరినీ ఫ్యామిలీ పిజిషన్ కార్య క్రమానికి పిలవాలని షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలి పారు. మాతా శిశు సంరక్షణ కార్డును సంపూర్ణంగా పూరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, ఎంపిహెచ్ఎస్ ముజీబ్‌బాషా, బి.రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పి జె.ఎస్.గోపికృష్ణ, సి.లక్ష్మీదేవి, ఆశ కార్యకర్త. కె.పద్మావతి,రోజా, ఎ.రమేష్‌బాబు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెల్లిగల్లులో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా, సచివాల సిబ్బంది అందు బాటులో ఉన్నారా లేరని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎపి డైరెక్టర్ జ్యుడిషియరీ జల్లా సుదర్శన్‌రెడ్డి, ఎంపి టిసిలు జాన్‌బాషా, చంద్రారెడ్డి, సర్పంచులు గోపనపల్లి గొల్లచెరువు జాకీర్ హుస్సేన్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ బాబా ఫక్రుద్దీన్, మైనార్టీ నాయకుడు, ఖాదర్ మోదీన్, తహశీల్దార్ దైవాదీనం, ఎంపిడిఒ, ఎస్ఐ వెంకట శివకుమార్, విఆర్‌ఒలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి : ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా వైసిపి ప్రభుత్వంలో పథకాలు వెలువ జరిగిందని గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. స్థానిక మండల కేంద్రంలోని గుండ్లూరు గ్రామపంచాయతీ కస్పానందు మంగళవారం గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి సమస్యల పరిష్కారం చేసి మురికినీటి కాలువలు, విద్యుత్ సమస్యలు అక్కడక్కడ పరిష్కరించడం జరిగింది. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి చుక్కల భూముల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గుండ్లూరు గ్రామంలో ఉన్నటువంటి రైతులకు చుక్కలు భూములకు రైతులకు పట్టాలి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయ నటువంటి పథకాలను మన జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి మధ్యవర్తులు లేకుండా నేరుగా అర్హుల ఖాతాలకు జమ చేయడం గర్వకరణంగా చెప్పుకోవచ్చని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి వేపల నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజాలోకవర్ధన్, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, తహశీల్దార్ భాగ్యలత, ఎంపిడిఒ గంగయ్య, విద్యుత్ శాఖ ఎఇ ముజీభీర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


చుక్కల భూములకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


అనారోగ్యంతో ఉన్న మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటియం మండలంలోని తుమ్మరకుంట, బూర్లపల్లి సచివాలయాలు మంగళవారం జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్హాన్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్, జగనన్న గృహ నిర్మాణాలు, ప్రజలకు అందుతున్న సేవలపై రిజిస్టర్లను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారం చేయడంలో ముందుండాలని సూచించారు.సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యలపై అలసత్వం వహించకుండా సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జెసి వెంట తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి, ఆర్ఐ అనీషా, పంచాయతీ కార్యదర్శులు మహ బూబ్‌బాషా, ఈశ్వర్‌రెడ్డి , విఆర్‌ఒలు వరదరాజులు, గంగాధర్ ఉన్నారు.


జెసికి మొక్కను అందిస్తున్న తహశీల్దార్


నిత్యావసర సరుకులను అందిస్తున్న సుబ్బనరసారెడ్డి

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని ఎస్‌బివిడి సభా ప్రాంగణంలో వత్తలూరు పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన రఘువరణ్ పుట్టినరోజు సందర్భముగా పుల్లంపేట విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు సమైక్య సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి చేతుల మీదుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఎంతో మంది నిరుపేదలు ఆకలికి అలమటిస్తున్నారని అన్నారు. పుట్టిన సందర్భంగా ఇలాంటి సేవా కార్య క్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణంతో పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహీద్, కోశాధికారి నరసింహులు, సభ్యులు ఆనంద్, జ్యోతీశ్వర్ నాయుడు, వాలంటీర్ మురళీ పాల్గొన్నారు.

పలువురు విఆర్‌ఒలు బదిలీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో పలువురు విఆర్‌ఒలను బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. నిమ్మనపల్లి నుంచి బదిలీ అయిన విఆర్‌ఒలతో బి.రజినీకాంత్ నిమ్మనపల్లి-2 నుంచి బడికాయల పల్లికి, జి.రాజగోపాల్ బండ్లపై నుంచి ముదివేడుకు, ఎం.శ్రీనివాసులు రాచవేటి వారిపల్లె నుంచి కలికిరికి బదిలీ కాగా, నిమ్మనపల్లి మండలానికి వచ్చిన విఆర్‌ఒలలో బి.రామకృష్ణ నడిమిచెర్ల నుంచి రాచవేటివారిపల్లికి , వి.రూప కుమార్ ఎర్రకొత్తపల్లి నుంచి నిమ్మనపల్లి-1కు, డి.వేణుగోపాల్ రెడ్డి ముదివేడు నుంచి బండ్లపైకి, ఎం.మంజునాథ్ పెంచలమర్రి నుంచి తవళంకు, కె.చంద్రశేఖర్ బురకాయలకోట నుంచి నిమ్మనపల్లి-2 కు బదిలీ అయినట్లు అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. త్వరలో వారికి కేటాయించిన స్థానాలలో బదిలీ అయిన విఆర్‌ఒలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

కొండలరావును అరెస్టు చేయాలి

- సిఐటియు నాయకులు శ్రీలక్ష్మి

ప్రజాశక్తి- పుల్లంపేట



ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం రాయవారి పాలెం గ్రామ అంగన్వాడీ కార్యకర్త హనుమాయమ్మను ట్రాక్టర్ తో గుద్ది చంపిన కొండలరావును వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకులు శ్రీలక్ష్మి మంగళ వారం నాడు ఒక ప్రకటనలో తెలియజేశారు. మృతి చెందిన అంగన్వాడీ కార్యకర్తకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మృతురాలి ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారని అన్నారు. కుటుంబ బాధ్యతలు మోస్తున్న హను మాయమును హత్య చేయడం ఆ కుటుంబానికి దిక్కులేకుండా పోయిం దన్నారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మండల వ్యవసాయ అధికారిగా మురళీధర్

గాలివీడు : మండలం వ్యవసాయ అధికారిగా మండెం మురళీధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతు కావలసిన అన్ని రకాల ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతు సమస్యలను పరిష్కారానికి ఎల్లవేళలా అందు బాటులో ఉంటానని తెలిపారు.

ఎంపిపి పదవికి తీవ్ర పోటీ

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు ఎంపిపి పదవికి నువ్వా..నేనా అన్న విధంగా పోటీ నెలకొని వుంది. ఇక్కడ ఎంపిపిగా ఉన్న జల్లా సుదర్శన్ రెడ్డికి రాష్ట్ర డైరెక్టర్ పదవి రావడంతో పదవికి రాజీనామా చేశారు. ఈనెల 8న గురు వారం ఉదయం 11 గంటలకు ఎంపిపి పదవికి ఎంపిక జరుగనుంది. వైస్ ఎంపిపిలుగా జల్లా పద్మావతమ్మ, మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి ఉన్నారు. వీరిద్దరిలో ఎంపిపి పదవికి నువ్వా..నేనా అన్న విధంగా ఉత్కంఠ రేపుతోంది. మండల అధ్యక్షులు ఎవరనేది ఎమ్మెల్యే చేతిలో ఉందని, ఆయన ఎవరికీ ఆమోదం తెలిపితే వారికే ఎంపిపి పదవి దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వైస్ ఎంపిపి యధుభూషణ్‌రెడ్డి వర్గం ఆయనకే ఎంపిపి పదవి దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఏది ఏమైనా గురువారం జరిగే ఎంపిపి అధ్యక్ష ఎన్నికలో ఎవరిని ఎన్నుకుంటారో వేచిచూడాల్సిందే.

ఎమ్మెల్యే సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం వర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపి చరిత్రలో మరపురాని ఘట్టంగా నిలిపేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని అన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయ పార్టీలు కులమ తాలక తీతంగా అర్హులైన వారికందరికీ అందజేసి ప్రతి కుటుంబంలోనూ జీవన ప్రమాణాలు మెరుగు పడే విధంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్ మల్లయ్యకొండ చైర్మన్ కెఆర్.మల్‌రెడ్డి, ఆర్‌వికె చైర్మన్ రెడ్డిమల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయ కులు రామ్మూర్తి, కరీం, కోటిరెడ్డి, రామశంకర్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో వైసిపి నాయకులు

బిసిలకు చేసిందేమీలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగుదేశం పార్టీ బిసిలకు చేసిం దేమీలేదని పలువురు బిసి నాయకులు పేర్కొన్నారు. స్థానిక దేవాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ 41 కౌన్సిలర్లలో టిడిపి పక్షాన ఉన్న ఒక్క కౌన్సిలర్‌ను నిలుపుకోలేక సస్పెండ్ చేసిందన్నారు. ఎంపిపి సానబోయిన శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ బిసిలను చట్టసభలకు పంపాలని స్థానిక బిసి నాయకుడు బొర్రా రామాంజనేయులు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను పాదయాత్ర సందర్భంగా అడిగితే లోకేష్ శవ రాజకీయాలు మాట్లాడారని దుయ్యబట్టారు. వైసిపి పలువురు బిసి నాయకులను చట్టసభలకు పంపిందని గుర్తు చేశారు. 2021 స్థానిక ఎన్నికలే బిసి నాయకులకు వైసిపి చేసిన మేలుకు నిదర్శనమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రెండు పార్టీల మెనిఫెస్టోలే రెఫరెండం అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపికి డిపాజిట్ దక్కదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, పలువురు బిసి నాయకులు మాట్లాడారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

వేరుశనగ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కొలవలి, ఉప్పలూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వేరుశెనగ పూత దశలో ఊడలు దిగే సమయంలో ఎకరాకు 250 కిలోల జిప్సం వేసి, నీరు పెడితే గింజ నాణ్యంగా ఏర్పడి మంచి నూనె శాతం పెరుగుతుందన్నారు. వేరుశనగ పంటలో ఇనుప ధాతులోపం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. నేల బెట్టకు నీటి ఎద్దడికి గురైనప్పుడు ఇనుప ధాతులోపం కనిపిస్తుందన్నారు. మొదట ఏ పంటలో అయినా లేత ఆకుల మీద ఇనుప ధాతులోపం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇనుము లోపం కనిపించిన లేత ఆకుల్లో ఈనెలు పసుపు వర్ణంగా మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వైవీయూ బిఇడి, ఎంఇడి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిఇడి, ఎంఇడి మూడో సెమిస్టర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విసి ఆచార్య చింతా సుధాకర్ వెల్లడించారు. మంగళవారం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లా వ్యాప్తంగా జరిగిన బిఇడి పరీక్షలకు 2,342 విద్యార్థుల హాజరు కాగా 2,240 ఉత్తీర్ణత పొందారని , 95.64 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఇదే తీరులో ఎంఇడి పరీక్షలు 98 మంది రాస్తే అందులో 80 మంది ఉత్తీర్ణత సాధిం చారని తెలిపారు. ఇందులో 81.63 శాతం ఉత్తీర్ణత నమోదయింది అన్నారు. కార్యక్ర మంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఈనెల 12 నుంచి బ్యూటీ పార్లర్ అండ్ మేనేజ్మెంట్ కోర్సుల్లో, ఈనెల 7 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని, ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. 18-45 సంవత్సరాల లోపు వయసు కలిగిన గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. చేసుకోవాలని కోరారు.


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలికిరి శాఖ గ్రంథాలయ అధికారి విజయకుమార్ తెలిపారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, క్రాఫ్ట్, పెయింటింగ్, డాన్స్, యాక్టింగ్, యోగ, సంగీతం, వేమన శతక పద్యాల పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించడానికి ఇలాంటి కార్యక్రమాలు పునాదులుగా మారుతాయని అన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 11న జరగబోవు ముగింపు కార్యక్రమంలో బహుమతుల అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శంగా వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కౌన్సిలర్ తుంగా వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక మహేశ్వర్ నగర్‌లోని 3వ సచివాలయ పరిధిలోని వాలంటీర్లకు మంగళవారం సచివాలయ కార్యాలయంలో ఆయన వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. అవార్డుల ప్రదానంలో 19 మంది వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డుతోపాటు ప్రశంసాపత్రాలు, రూ.10వేల నగదు అందించారు. సేవా మిత్ర అవార్డు గ్రహీతలకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి, సచివాలయ అడ్మిన్ హారిక, సిబ్బంది విజయ్, భార్గవి, విఆర్‌ఒ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూముల రీసర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

జగనన్న సమగ్ర భూ సర్వే త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జెసి, ఆర్‌డిఒ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్ గదులను పరిశీలించారు. జగనన్నకు చెబుదాం వినతులు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వే డిటి సౌజన్య, సర్వేయర్ విజయభాస్కర్, విఆర్‌ఒ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై గువ్వల చెరువు పార్కింగ్ స్థలం వద్ద బైకును కారు ఢీకొనడంతో మోటార్ బైక్ నడుపుతున్న దర్బార్‌బాషా అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాలు మేరకు.. టి.సుండుపల్లి మండలం రాయవరం చెందిన దర్బార్‌బాషా(35) మోటార్ బైక్‌పై గువ్వలచెరువు వచ్చి తిరిగి వెళుతుండగా కడప వైపు నుంచి కారు మోటార్ బైక్‌ను ఢీ కొట్టగా దర్బార్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.


మృతి చెందిన దర్బార్‌బాషా

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలు.మధ్యాహ్నం సుమారు 12 గంటల 30 నిమిషాలకు బి.కొత్తకోట మండలం పిటిఎం రోడ్డు టి.సదుం క్రాస్ - మల్లెల క్రాస్ మధ్యలో నర్సరీ సమీపంలో బుర్లపల్లి వైపు నుంచి బి.కొత్తకోటకు కారులో వెళుతుండగా వెనకవైపు బూర్లపల్లివైపు నుంచి బి.కొత్తకోటకు ద్విచక్రవాహనాన్ని బూర్లపల్లిలో నివాసమున్న బుచ్చిగారి బయ్యారెడ్డి (47) కారు వెనుక కుడివైపు ఢీకొనడం వల్ల బయ్యారెడ్డి తల కారు కుడివైపు ఇండికేటర్ తగలడంతో తల నుదుటిన బలమైన రక్తగాయమైందన్నారు.అంతట అతన్ని 108లో చికిత్స నిమిత్తం తీసుకుని వెళ్లారు. అక్కడ డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బయ్యారెడ్డి మృతి చెందాడన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దేరంగుల పెద్ద ఓబులేసు అరెస్టును చూపుతున్న డిఎస్‌పి

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని పేద ప్రజలకు ఆశ చూపి తన స్వంత భూమిని దానం చేసి ఇళ్ళ స్థలాలు ఇస్తానని నమ్మించి వారి వద్ద నుండి డబ్బులు తీసుకొని అగ్రిమెంటు రాసుకొని ఇతరుల భూమిలో అక్రమంగా ప్రవేశించి స్థలాలు చూపించి ప్రజలను మోసం చేసిన దేరంగుల పెద్ద ఓబులేసును పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలు.. ఎస్పి ఆర్.గంగాధర్‌రావు, మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, రూరల్ సిఐ ఒ.శివాంజనేయులు ఆదేశాల మేరకు కరెంటుకాలనీలో చిల్లరఅంగడి వద్ద పెద్ద ఓబులేసు ఉన్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశామన్నారు. జయశ్రీ కాలనీకి చెందిన డి.ఓబులపతి, దేరంగుల పెద్దఓబులేసు(64) గత కొంతకాలంగా వృత్తి రీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, బ్రోకర్‌గా వ్యవహరిస్తూ ఉండేవాడని, తన స్వలాభం కోసం వేరొకరి భూమిని తన భూమిగా ప్రజలను నమ్మించి, దాన విక్రయం కింద పేద ప్రజలకు రాసిస్తానని వారి వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశాడన్నారు. ఈ కేసులో ఫిర్యాది కె.చంద్రశేఖర్ అనే వ్యక్తికి గ్రామ పంచాయతి పరిధిలోని సర్వే నెం.243/1లో మొత్తం భూమి 9.27 ఎకరాలు ఉన్నట్లు అందులో ఇతనికి 2.13 ఎకరాలు, మిగిలిన భూమి కొంత మందికి కలదని, ప్రస్తుతం ఆ భూములు సాగులో లేనందువలన దేరంగుల పెద్ద ఓబులేసు అనే వ్యక్తిపై కనబరిచిన సర్వే నెంబరు కాకుండా మరొక సర్వే నెం.245 వేసి,పేద ప్రజలకు తక్కువ ధరకు ఇల్లా పట్టాలు ఇస్తానని,వారి దగ్గర ఒక కుంటకు రూ.3 వేలు చొప్పున డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. సుమారు 260 మందికి అగ్రిమెంట్ రాసిచ్చినట్లు తెలిపారు. అందరిని పిలుచుకొని ఫిర్యాది భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, గుంతలు తవ్వి, రాళ్ళు నాటించి నాడన్నారు. తహశీల్దార్ కార్యాల యంలో భూ రికార్డులు పరిశీలించి సరైన భూ యాజమాన్యహక్కు వివరాలు అడుగగా, తహశీల్దార్ ఇచ్చిన డాక్యు మెంట్‌లను పరిశీలించి కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలిం చామన్నారు. ఇంకా ఎవరైనా మోసపోయి బాధితులు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎవరైనా ఇంటి స్థలాలు , భూములు కొనాలని అనుకుంటే తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని, నిర్ధారించుకొని రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.